ఎముకలు గుల్లబారుతున్నాయ్!

- మెత్తబడుతున్న మనిషి ఎముకలు
- ఆస్టియోపోరోసిస్‌తో సతమతం
- పాతికేళ్ల క్రితం 60 ఏళ్ల తర్వాత ఈ సమస్య
- ఇప్పుడు యుక్త వయస్సు వారినీ వేధింపు
- జిల్లాలో 8 శాతం మందిలో సమస్య
- నేడు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం

ఉక్కులా ఉండాల్సిన మనిషి ఎముకలు మెత్తబడుతున్నాయి. కొండలనైనా పిండి చేయాల్సిన ఎముకలు కింద పడితేనే చాక్‌పీస్‌లా విరుగుతున్నాయి. జీవనశైలిలో మార్పుల కారణంగా శరీరానికి వ్యాయామం తగ్గిపోవడమే దీనికి కారణమని వైద్యులు చెబుతున్నారు. నేడు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్): మనిషి ఎముక మెత్తబడటాన్ని ఆస్టియోపోరోసిస్ అంటారు. ఈ వ్యాధితో బాధపడే వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు 4 నుంచి 5 శాతం మందిలో మాత్రమే ఉండే ఈ వ్యాధి ప్రస్తుతం 8 శాతానికి చేరింది. ఒకప్పుడు 60 ఏళ్ల తర్వాత కనిపించే ఈ వ్యాధి ప్రస్తుతం 30 నుంచి 40 ఏళ్లలోనే కనిపిస్తోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎముకలు, కీళ్ల విభాగానికి ప్రతిరోజూ 200 మంది దాకా ఓపీ రోగులు చికిత్స కోసం వస్తుండగా వారి లో 20 శాతం అంటే 40 మంది దాకా ఆస్టియోపోరోసిస్ వ్యాధిగ్రస్తులు ఉంటున్నారు. ఇందులో నడు ము, వెన్నుముక, మెడనొప్పి, మోకాళ్లు, కండరాల నొప్పులతో బాధపడుతూ వచ్చే వారిలో ఈ వ్యాధి బయటపడుతోంది. ఈ వ్యాధిని ప్రారంభదశలో ని యంత్రించాలని, లేకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇది ఎవరికి వస్తుందంటే...!

సాధారణంగా ఇది 45 ఏళ్లు పైబడిన మహిళల్లో, మెనోపాజ్ దశకు చేరుకున్న వారిలో కనిపిస్తుంది. తగినంత సూర్యరశ్మిని అందని వారు, వ్యాయామం చేయని వ్యక్తులు కూడా దీనిబారిన పడే అవకాశం ఉంది. మద్యపానం, పొగతాగే అలవాటు ఎక్కువగా ఉన్న వారికి, శరీరంలో కాల్షియం స్థాయిలు తక్కువగా ఉన్న వారిలో, కుటుంబంలో ఇంతకు ముందే ఎవ్వరికైనా ఈ వ్యాధి సోకితే జన్యుపరంగానూ ఇది వ్యాపించవచ్చు. ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఏసీ సౌకర్యం ఉండే జిమ్‌లలో వ్యాయామం చేస్తున్నారు. అలా గాకుండా పార్కులు, సూర్యరశ్మి తాకే చోట వ్యాయామం చేయడం ఉత్తమం. దీని వల్ల శరీరానికి డి విటమిన్ లభిస్తుంది. దీంతో ఎముకలు బలంగా మారే అవకాశం ఉంటుంది.

ఆస్టియోపోరోసిస్ అంటే...!

ఆస్టియోపోరోసిస్‌ను తెలుగులో బోలు ఎముకల వ్యాధి అంటారు. దీని కారణంగా ఎముక ఖనిజ సాంద్రత తగ్గుతుంది. దీని కారణంగా ఎముక పౌడర్‌గా పడిపోతుంది. అంటే తడిగా ఉన్న గోడ నుంచి ప్లాస్టర్ పడిపోయినట్లుగా అన్నమాట. ఈ వ్యాధి కారణంగా ఎముకలు చాలా బలహీనమవుతాయి. గతంలో స్త్రీలలోనే ఇది ఎక్కువగా కనిపించేది. ఇప్పుడు పురుషుల్లోనూ ఇది కనిపిస్తోంది. దీనివల్ల వెన్ను, నడుము, మెడ, మోకాళ్లనొప్పులు సర్వసాధారణమయ్యాయి.

వ్యాధి నిర్ధారణ

ఎక్స్‌రే ద్వారా ఆస్టియోపోరోసిస్ వ్యాధిని నిర్ధారించవచ్చు. తక్కువ లక్షణాలు ఉండే వారిలో ఎముకలు పెళుసుగా మారాయని తెలుసుకోలేరు. ఇలాంటి అతి చిన్న లక్షణాలు గుర్తించేందుకు, సరైన చికిత్స అందించడానికి డీఈఎక్స్ స్కాన్ (బోన్ డెన్సిటీ స్కాన్) చేయాల్సి వస్తుంది.

ఇవి మానేయాలి

- మితిమీరిన మద్యపానంతో ఎముకలు గుల్లగామారుతాయి.
- ధూమపానంతో ఎముకల సాంద్రత తగ్గి బలహీనమై తేలికగా విరుగుతాయి. శరీరంలోని ఈస్ట్రోజన్ హార్మోన్ సామర్థ్యం తగ్గి ఎముకలు బలహీనమవుతాయి.
- శీతల పానియాలు అతిగా తీసుకోకూడదు. ఇందులో ఉండే అదనపు ఫాస్పరస్ శరీరం కాల్షియంను తీసుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

ఇలా చేయాలి

శరీరంలో సరిపడా కాల్షియం లేకపోతే తన అవసరాల కోసం శరీరం ఎముకల నుంచి కాల్షియం తీసుకుంటుంది. ఫలితంగా ఎముకల సాంద్రత తరిగిపోతుంది. కాబట్టి ప్రతిరోజూ ఆహారంలో సరిపడా కాల్షియం శరీరానికి అందిస్తూ ఉండాలి. ఇందుకోసం ఫ్యాట్ ఫ్రీ పాలు, సోయాపాలు, టోఫు, తృణధాన్యాలు తీసుకోవాలి. ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే బ్రొకోలి లాంటి కూరగాయలు ఎంచుకోవాలి. విటమిన్–డి కోసం ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. చీజ్, గుడ్లు తినాలి.

ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్ష



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎముకల సాంద్రత పరీక్ష (బోన్ మినరల్ టెస్ట్)ను ఉచితంగా నిర్వహిస్తున్నారు. వైద్యుల సూచన మేరకు ఈ పరీక్షను చేయించుకోవాలి. ఇందులో ఎముకల్లో ఖనిజ సాంద్రతను బట్టి అవసరమైన చికిత్స అందిస్తాము. చికిత్సలో భాగంగా కాల్షియం, విటమిన్–డి3 మాత్రలను నియమిత కోర్సులో ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పాటు వ్యక్తి శారీరక వ్యాయామం, వాకింగ్ చేయడంతో పాటు పోషకాహారం తీసుకోవాలి. 50 ఏళ్లు దాటిన మహిళల్లో ఇది తరచుగా కనిపిస్తోంది. గర్భాశయంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ విడుదల తగ్గిపోతే ఎముకలు పెళుసుబారతాయి. దీనివల్ల కాలు స్లిప్ అయినా ఎముకలు విరిగే ప్రమాదం ఉంది.

–డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ విభాగం, జీజీహెచ్, కర్నూలు

మహిళల్లో ఆస్టియోపోరోసిస్ ఎక్కువ



మెనోపాజ్ తర్వాత మహిళలను ఇబ్బంది పెట్టే సమస్యలలో ఆస్టియోపోరోసిస్ కూడా ఒకటి. దీనిలో ఎముకల సాంద్రత తగ్గి, పటుత్వం కోల్పోయి అవి గుల్లబారతాయి. ఎముకల గుల్లబారటం చాలా నెమ్మదిగా జరగడం వల్ల చాలా మందిలో ఎముకలు విరిగేంత వరకు ఎలాంటి లక్షణాలు కనపడవు. డబ్ల్యూహెచ్‌వో సర్వే ప్రకారం 50ఏళ్లు పైబడిన వారిలో ప్రతి ముగ్గురు స్త్రీలలో ఒకరు, ప్రతి 8 మంది మగవారిలో ఒకరు ఆస్టియోపోరోసిస్‌కు గురవుతున్నారు. జీవనశైలిలో మార్పులు, పోషకాహారం తీసుకోవడం, సరైన వ్యాయామం చేయడం, వ్యాధిని తొలిదశలో గుర్తించడం వల్ల ఈ వ్యాధి నుంచి కాపాడుకోవచ్చు.

–డాక్టర్ టి. విజయ్‌కృష్ణారెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు, కర్నూలు

క్లుప్తంగా

పేద పిల్లలకు నిత్యావసరాల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని వడ్డేగేరిలోని కేవీ గార్డెన్‌లో ఉన్న నగర పాలక ప్రాథమికోన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా నిత్యావసర కిట్లను ఇంటర్నేషనల్ చారిటీ ఎయిడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ ఎండీ నౌషద్ చేతుల మీదుగా 45 మంది పిల్లలకు ఈ కిట్లు పంపిణీ చేశారు. వీటితో పాటు స్పోర్ట్స్ కిట్లను సైతం పిల్లలకు అందించారు. తద్వారా పిల్లలకు ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా వస్తుందన్నారు. పిల్లలు ప్రతిరోజూ నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని, నోటి శుభ్రతతో ఆరోగ్యం దాగి ఉందని డాక్టర్ నౌషద్ సూచించారు. కార్యక్రమంలో ఐవైడీఎఫ్ డైరెక్టర్ మార్కో, పాఠశాల హెడ్ మాస్టర్ కస్తూరి, ఉపాధ్యాయులు మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన గ్రామసభలు

కర్నూలు (సెంట్రల్): రీసర్వే జరిగిన గ్రా మాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు రెండో రోజు కొనసాగాయి. మొత్తం 26మండలాల్లోని ఒక్కో గ్రామంలో గ్రామ సభలు నిర్వహించారు. మొత్తం 1,574 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించినట్లు సర్వే ఏడీ మునికన్నన్ తెలిపారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటా



కార్పస్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు (టౌన్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ముగ్గురు అమర వీరుల కుటుంబాలు, విధి నిర్వహణలో మరణించిన 10 మంది పోలీసు కుటుంబ సభ్యులతో ఎస్పీ సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు ప్రసాద్, కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ రమేష్ భార్య రాధకు రూ. లక్ష, ఆర్మ్‌డ్ రిజర్వుడు హెడ్ కానిస్టేబుల్ పి.ఖాన్ భార్య నసీమ్‌కాతూన్‌కు రూ. లక్ష కార్పస్ ఫండ్ చెక్కు అందజేశారు

ద్విచక్ర వాహనాల తనిఖీలు

కర్నూలు (టౌన్): నగరంలో పలు కాలనీల్లో ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనాల తనిఖీ చేపట్టారు. స్థానిక వెంకటరమణ కాలనీలో వేగంగా వెళ్తున్న 10 ద్విచక్ర వాహనదారులపై కేసు కేసులు నమోదు చేశారు. విపరీతంగా సౌండ్ చేసుకుంటూ వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ కుళాయి కనెక్షన్లపై విచారణ షురూ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ కుళాయి కనెక్షన్లపై విచారణ ప్రారంభమైంది. ట్యాప్ కనెక్షన్ ఇన్‌స్పెక్టర్లపై అవినీతి ఆరోపణలు, స్థానిక ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో అంతర్గతంగా విచారించిన ఇంజినీరింగ్ అధికారులు ఇద్దరు ట్యాప్ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదే క్రమంలో వార్డుల వారీగా విచారణ చేసేందుకు తొమ్మిది మంది ఉద్యోగులను నియమించారు. కనెక్షన్ల విచారణ పూర్తయిన తరువాత రికార్డు పరంగా తనిఖీ చేసేందుకు మరో ఐదుగురి అధికారులను నియమించారు. నాలుగు రోజుల్లో పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ఆదేశించారు. కొన్నేళ్లుగా ట్యాప్ ఇన్‌స్పెక్టర్లుగా కొనసాగుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరిని కంపోస్టు యార్డుకు బదిలీ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

సీఎంఈలతో మరింత విజ్ఞానం



జోనల్ సీఎంఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫోరెన్సిక్ వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): వైద్యకళాశాలల్లో నిర్వహించే నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులు వైద్యులు, వైద్య విద్యార్థుల్లో మరింత జ్ఞానాన్ని పెంచుతాయని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ చెప్పారు. డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిబంధనల ప్రకారం శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో 'విష, మత్తు పదార్థాలు, సమాజంపై వాటి దుష్ప్రభావాలు, ఫోరెన్సిక్ నిపుణుల పాత్ర' అనే అంశంపై సీఎంఈ నిర్వహించారు. సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ప్రారంభించి ప్రసంగించారు. హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు కళాశాలలోని అన్ని విభాగాల ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా జోనల్ సీఎంఈలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్‌లు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయానందబాబు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లక్ష్మీబాయి, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం, ఫోరెన్సిక్ నిపుణులు జి.వీరనాగిరెడ్డి, ఆర్. శంకర్, పి.బ్రహ్మాజి మాస్టర్, ఎం.బాబు, జి. మహేష్, జడ్. శశికాంత్, ఎం.శ్రీనివాసనాయక్, ప్రభాకర్, జగదీష్‌నాయక్, జి.దినేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాటేసిన కరెంట్

కర్నూలు (టౌన్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ షాక్‌తో ఇరువురు మృతి చెందారు. స్థానిక వెంకటరమణ కాలనీలో గిరిబాబు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు ఒక కూతురు ఉంది. శనివారం ఉదయం ఇంట్లో వాటర్ హీటర్ ఆన్ చేసేందుకు వెళ్లిన ఆయ న భార్య సత్యవేదమ్మ (28) కరెంట్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబసభ్యు లు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. బాధితురాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే బండిమెట్టకు చెందిన ముత్తు (19) వృత్తిరీత్యా కరెంటు పనులు చేస్తున్నాడు. శనివారం స్థానిక ప్రకాష్ నగర్‌లో ఓ ఇంట్లో కరెంటు పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని మహిళ మృతి



మృతి చెందిన మహిళ

కర్నూలు (టౌన్) : కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందారు. గార్గేయపురం గ్రామ పరిధిలోని బండ్ల చేను రస్తా వద్ద ఉన్న బస్సు షెల్టర్ ఎదురుగా మహిళా మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు 5.4 అడుగుల ఎత్తు ఉందన్నారు. శరీరంపై తెలుపు, ఎరుపు, నలుపు రంగులతో కలిసిన పూల డిజైన్ చీర ధరించి ఉందని తెలిపారు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు 91211 01064 సెల్ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

స్పోర్ట్స్

తైక్వాండో క్రీడాకారుడికి అభినందనలు



మెడల్స్ సాధించిన క్రీడాకారుడిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

కర్నూలు (టౌన్): ఈనెల 6 నుండి 8 వరకు తిరుపతి పట్టణంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలుర విభాగంలో ప్రణవ్ శ్రీరామ్ ప్రతిభ చాటారు. ఈనేపథ్యంలో ఆ విద్యార్థిని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ అభినందించారు. శనివారం స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం మెడల్స్ , సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన న్యాయవాది శ్రీధర్ రెడ్డి

కర్నూలు (టౌన్) : ఈనెల 20, 21 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే 43 వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని స్పోర్ట్స్ ప్రమోటర్, న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులను శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తన వంతుగా క్రీడల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందుకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి బి. ఈశ్వర్ నాయుడు, క్రీడా సంఘాల ప్రతినిధులు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో దీప్తి

కర్నూలు(హాస్పిటల్): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సీఈఓ పి. దీప్తి చెప్పారు. శనివారం స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్‌జోసఫ్ డిగ్రీ కళాశాలలో 'మత్తు పదార్థాల అనర్థాలు, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో డ్రగ్స్ వినియోగం, మహిళలపై లైంగిక వేధింపులు, సైబర్‌క్రైమ్ నేరాలు ఎక్కువయ్యాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఎక్కువగా దీనికి బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ సహకారంతో అన్ని కళాశాలల్లో దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యువత తెలిసీ తెలియక మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాలను ఆయన విపులంగా వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమణారావు మాట్లాడుతూ బాలికలు, మహిళలు సోషల్ మీడియాలో తమ ఫొటోలు అప్‌లోడ్ చేయకూడదని, వాటి వల్ల మహిళల ఫోటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. బాధితులు ఎవరికీ చెప్పకుండా తమలో తామే కుమిలిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇలాంటి సంఘటనలు జరిగితే భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు తెలిపి వారి ద్వారా పోలీసులను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందన్నారు. అలాగే బహుమతులు, స్పెషల్ ఆఫర్లు అంటూ మొబైల్ ద్వారా వచ్చే ఎలాంటి లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఇటీవల కాలంలో మొత్తం సమాచారాన్ని సేకరించి వేధించడం ఎక్కువైందన్నారు. సైబర్ క్రైమ్ నేరాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 100, 181, 1930 మొదలైన టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా వెంటనే సంప్రదిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సివి సత్యనారాయణ, సెట్కూరు సిబ్బంది శ్యాంబాబు, శ్రీనివాససింగ్ పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేలు పెట్టుబడిసాయం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇవ్వాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశా రు. శనివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేల నగదును ఖరీఫ్ సీజన్ ముగిసిన ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి నిధిపై నోరు మెదపకపోవడం దారుణమైన విషయమన్నారు. రబీ రైతులకు బీమా మొత్తాన్ని కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ.25 వేలను పరిహారంగా ఇవ్వాలని కోరా రు. ధరలు పడిపోయిన పత్తి, ఉల్లి, కొర్ర రైతులను ఆదుకోవాలన్నారు. నాయకులు డి. శ్రీనివాసరావు, సురేంద్ర యాదవ్, రామాంజనేయులు, కృష్ణానాయక్, బాషా పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి

కర్నూలు (లీగల్) : ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాజధాని అయిన కర్నూలులో రాష్ట్ర హైకోర్టు బెంచ్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని కర్నూలుకు చెందిన న్యాయవాది, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. శనివారం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులంతా సీఎంను కలసి వరద బాధితుల సహాయంగా రూ.10 లక్షలు విరాళం అందజేశారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ త్వరితగతిన అందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.

సబ్ లీజ్‌పై హైకోర్టు స్టే

కర్నూలు(అగ్రికల్చర్): పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపింగ్ కాంప్లెక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపును ఖాళీ చేయించాలని పర్సన్ ఇన్‌చార్జీ లక్ష్మీకాంతరెడ్డి ఇచ్చిన నోటీసు అమలుపై హైకోర్టు స్టే ఇచ్చింది. జగదీశ్వరరెడ్డి అనే వ్యక్తి తన భార్య శ్యామలాదేవి పేరుతో షాపింగ్ కాంప్లెక్స్‌లోని 4 షాపులను 3 ఏళ్ల కాలానికి లీజుకు తీసుకున్నారు. అగ్రిమెంటులో సబ్ లీజుకు ఇవ్వరాదని, అ సాంఘిక కార్యక్రమాలు చేపట్టరాదనే షరతులు ఉన్నాయి. దీనిని ఉల్లంఘించి ఒక షాపును మద్యం షాపునకు సబ్ లీజుకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో 48 గంటల్లో మద్యంషాపు ఖాళీ చేయించాలని పసుపల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంతరెడ్డి లీజుదారు అయిన శ్యామలమ్మకు నోటీసు ఇచ్చారు. ఈ నోటీసులను లీజుదారు మద్యం షాపు నిర్వాహకులకు అందజేశారు. లీజుదారుకు ఇచ్చిన నోటీసుపై మద్యంషాపు నిర్వాహకుడు శనివారం హైకోర్టు లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. విచారించిన హైకోర్టు న్యాయమూర్తి పర్సన్ ఇన్‌చార్జీ ఇచ్చిన నోటీసుల అమలును నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రజలను మోసం చేసిన బాబు

కర్నూలు న్యూసిటీ : ఎన్నికల ముందు మాయమాటలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మోసం చేస్తున్నారని సీపీయం నాయకులు రాజగోపాల్, షరీఫ్ విమర్శించారు. ట్రూ అప్ చార్జీలను వ్యతిరేకిస్తూ సీపీఐ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆధ్వర్యంలో పాత నగరంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. తర్వాత విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాకృష్ణ, రవికుమార్, సీనియర్ నాయకులు పార్వతయ్య, ఖాజాపాషా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న బిలీవర్స్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్ణాటకకు చెందిన బీమ్‌రాజ్ అనే వ్యక్తి బిలీవర్స్ మార్కెటింగ్ కంపెనీ పేరుతో ఐటీఐ, ఇంటర్, డిగ్రీ పూర్తయిన నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు.

పన్నులు చెల్లించండి

కర్నూలు (టౌన్): నగరపాలకకు సకాలంలో పన్నులు చెల్లించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజు సైతం పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తాయని, ప్రజలు తమ ఆస్తి, నీటి పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు.

అంటరానితనానికి తావులేదు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: హిందూ సమాజంలో అంటరాని తనానికి తావు లేదని వీహెచ్‌పీ న్యూఢిల్లీ కేంద్రీయ సామాజిక సమరసత ప్రముఖ్ దేవ్‌జీ రావత్ అన్నారు. శనివారం నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఇప్పటికి అంటరాని తనం రుగ్మత కొనసాగుతోందన్నారు. దీన్ని రూపు మాపడం వీహెచ్‌పీ కార్యకర్తల ప్రథమ కర్తవ్యం అన్నారు. అనంతరం ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వీహెచ్‌పీ కార్యాలయంలో నిర్వహించే శ్రీరామాయణం పరీక్ష నిర్వహణ సమితి సమావేశం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, భాగ్యనగర్ క్షేత్ర సంఘటనా కార్యదర్శి గుమ్మళ్ల సత్యం, విధి ప్రముఖ్ సూర్య ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, సహ కార్యదర్శి ప్రాణేష్, కోశాధికారి సందడి మహేష్, సహ కోశాధికారి గూడా సుబ్రహ్మణ్యం, మాతృశక్తి కన్వీనర్ గౌరి, విశేష సంపర్క ప్రముఖ్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ భగవద్గీత పుస్తక ప్రసాదం

కర్నూలు కల్చరల్ : భగవద్గీత పుస్తక ప్రసాదం ప్రతి విద్యార్థికి అందేలా పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు చూడాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూ లు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి విద్యార్థికి ఉచితంగా అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానములు రెండు లక్షల పుస్తకాలు జిల్లాకు అందించినట్లు తెలిపారు. ఈ 30 పేజీల పుస్తకంలో మానవ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో తెలుపుతుందని పేర్కొన్నారు. పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9059802265, 9441008677 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

కర్నూలు (సెంట్రల్): వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి కారుణ్య నియామకాల కోసం వచ్చిన దరఖాస్తుల సీనియారిటీ జాబితాను రూపొందించినట్లు డీఆర్వో చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 26వ తేదీ లోపు లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని సూచించారు. కాగా సీనియారిటీ జాబితాను డీఆర్వో కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచినట్లు ఆయన వివరించారు.

గిరిజన హాస్టళ్లలో మౌలిక వసతులు పెంచాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు పెంచాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు, రాయలసీమ రీజినల్ ఇన్‌చార్జ్ మోపిరి సూర్య అన్నారు. ఎన్‌టీఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వారు శనివారం జిల్లాలోని పలు గిరిజన వసతి గృహాలను పరిశీలించినట్లు చెప్పారు. పలు వసతి గృహాల్లో తమ పరిశీలనకు వచ్చిన అంశాలను గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుశలన్న, ప్రధాన కార్యదర్శి మోటా సురేష్, నంద్యాల జిల్లా నాయకులు నాగసారి సుంకన్న, గాలేటి శ్రీనివాసులు, పోతురాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.